సాక్షి
వనపర్తి

ఆదివారం । 21 । జనవరి । 2024



వెల్లివిరిసిన మత సామరస్యం

ఉమామహేశ్వరం ఉత్సవాలు, నిరంజన్ షావలీ దర్గా ఉర్సుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

వివరాలు 8లో ▸



కాల్వల మరమ్మతు జరిగేనా?

జూరాల, భీమా కాల్వలు మరమ్మతుకు నోచుకోక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు.

వివరాలు 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.8 /17.9

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త పెరుగుతుంది. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఆందోళనలు విజయవంతం చేయాలి'



పెబ్బేరు రూరల్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా చేపట్టే ఆందోళనలో అందరూ భాగస్వాములు కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర విధానాలపై ఈ నెల 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. 26న జిల్లాకేంద్రాల్లో ట్రాక్టర్, వాహన ర్యాలీలు, ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె, రైతు కూలీసంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ నిర్వహించాలని కోరారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని.. కార్పొరేట్లని తరిమికొట్టాలని.. దేశాన్ని రక్షించాలనే నినాదంతో జరిగే ఈ ఆందోళనల్లో అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, మహిళా, విద్యార్థి లోకమంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా **అధ్యక్షుడు** మండ్ల రాజు, జిల్లా ప్రధాన **కార్యదర్శి** పుట్టా ఆంజనేయులు, రైతు సంఘం **అధ్యక్షుడు** బాల్‌రెడ్డి, నాయకులు పరమేశ్వ**రాచారి,** రాజు, అజయ్, అమరచింత మున్సి**పల్ వైస్** చైర్మన్ గోపి, బుచ్చమ్మ, మదన్, **నిక్సన్,** రాముడు, కురుమన్న పాల్గొన్నారు.

23 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు



కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో తెలంగాణ జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దేవని ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సంబరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడానికి సంబరాలు నిర్వహిస్తున్నామని, ఇంగ్లీష్, తెలుగు మీడియం 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ పోటీల్లో ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. 4 దశల్లో పోటీ పరీక్ష ఉంటుందని, ఈ నెల 23 నుంచి పాఠశాలస్థాయి, 27 నుంచి మండలస్థాయి, ఫిబ్రవరి 3న జిల్లాస్థాయి పోటీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, వివేకానంద, నిర్మలాదేవి, రాజవర్ధన్‌రెడ్డి, రఘు, ప్రవీణ్‌రెడ్డి, రామకృష్ణ, పద్మావతి, విజయలక్ష్మి, రమేష్, సలీం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండలో వైభవంగా తిరుచ్చిసేవ



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుంచి స్వామివారిని శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంలో దేవస్థానం ముందు ఉన్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. తిరుచ్చి వాహనంలో ఊరేగుతూ స్వామివారు భక్తకోటికి దర్శనమిచ్చారు. మండపం వద్ద ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని మళ్లీ గర్భగుడి వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూద్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

ఉమ్మడి పాలమూరు జిల్లా రామనామ జపం చేస్తోంది. అయోధ్యలో రామయ్య విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ముహూర్తం ఆసన్నమవుతోంది. ఈ విశేష పుణ్యకార్యానికి సంబంధించిన అన్ని క్రతువులు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అయోధ్య అక్షింతలతోప్రతి కుటుంబానికి రామయ్య ఆశీస్సులు అందాయి. అక్షింతలను అందుకున్న భక్తులు జై శ్రీరామ్ అంటూ ఆనందపరవశంలో మునిగిపోయారు. సోమవారం బాలరాముడి (రామ్‌లల్లా)కి ప్రాణప్రతిష్ట చేస్తుండడంతో.. పల్లె నుంచి పట్నం వరకు ఊరూవాడాలో ఉత్సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

- మహబూబ్‌నగర్ డెస్క్



అంతా రామమయం!

ప్రతి ఇంటికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ	అక్షింతలతోపాటు అయోధ్య చిత్రపటం, కరపత్రం అందజేత	విగ్రహ ప్రతిష్ఠాపన రోజు ప్రతి గ్రామంలో ఉత్సవాలు	ఊరువాడల్లో భారీ స్క్రీన్లపై ప్రాణప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారం

అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ట కోసం యావత్ భారతం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా.. ఎవరి నోట విన్న అయోధ్య, రామమందిరం, రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ.. ఈ మాటలే వినిపిస్తున్నాయి. ప్రతిచోటా జై శ్రీరామ్ నినాదాలు.. ప్రతి ఇల్లు, ప్రతి వీధిలో రామనామం తాండవమాడుతోంది. పాలమూరులోని ప్రతి పల్లె కాషాయ తోరణాలతో కళకళలాడుతోంది. హిందూ ధార్మిక సంస్థలు, నాయకులు ప్రతిరోజూ పురాతన, ప్రముఖ ఆలయాలను శుభ్రం చేస్తున్నారు. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన పుణ్యకార్యాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది సంఖ్యలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు దేవాలయాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఆ రోజు భజనలు, హనుమాన్ చాలీసా, కీర్తనలు ఆలపించనున్నారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఇక్కడ మహాహారతి, గంటానాదం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ఎదుట ఐదు దీపాలు వెలిగించి సర్వ దేవతలను స్మరించుకోనున్నారు.



మహబూబ్‌నగర్‌లో అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు (ఫైల్)

■ నాగర్‌కర్నూల్, పాలమూరు, నారాయణపేట తదితర ప్రాంతాల్లో కరసేవలను సన్మానించనున్నారు. అయోధ్యకు వెళ్లేందుకు జిల్లాలో కొందరు ప్రముఖులకే ఆహ్వానం అందినప్పటికీ.. ఈ అద్భుతమైన ఘట్టాన్ని తిలకించేందుకు తమ ఇష్టదైవాన్ని దర్శించుకోవడానికి రామ జన్మభూమికి తరలివెళ్తున్నారు.

అయోధ్య రాముడి చెంత విశేష పూజలు అందుకున్న అక్షింతలు ఇప్పటికే ఇంటింటికీ చేరాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైంది. 20 రోజులుగా ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగింది. ఉమ్మడి జిల్లాకు దాదాపు 25 క్వింటాళ్ల అక్షింతలు వచ్చాయి. వీటిని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా కమిటీల ద్వారా మండలాలకు.. అక్కడి నుంచి గ్రామాలకు చేరవేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచాలక సమితి సభ్యులు, హిందూ ధార్మిక సంస్థలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక భావన కలిగిన వారితో కలిసి దాదాపు 40 వేల మంది.. ప్రతి ఇంటికి వెళ్లి అక్షింతలు అందజేశారు. వారు రాముడి విశిష్టతను భక్తులకు వివరించి.. అయోధ్య రామాలయం చిత్రపటం, కరపత్రాలను కూడా అందజేశారు. సాక్షాత్తు ఆ రాముడే తమ ఇంటికి వచ్చినట్లు భక్తులు భావించి హారతిపట్టి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు స్వీకరించారు. పుణ్యకార్యంలో తాము భాగస్వాములమవుతున్నామని ఆనందపడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 10 లక్షల కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేశారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలోని 890 గ్రామాల్లో, 40 బస్తీల్లో (పట్టణాలు) 3,74,380 మంది కుటుంబాలకు, నాగర్‌కర్నూల్‌లో 2.89 లక్షలు, వనపర్తిలో 1.80 లక్షలు, గద్వాలలో 1.20లక్షల కుటుంబాలకు అక్షింతలు అందజేశారు. పలు ప్రాంతాల్లో అక్షింతల కలశాలకు స్థానిక ఆలయాల్లో పూజలు చేసి భారీ ఊరేగింపులు, శోభాయాత్రలు చేపట్టారు.

ప్రతి ఇంటికీ రామయ్య ఆశీస్సులు

■ రామయ్య అక్షింతలు దేవుడి గదిలో దాచిపెట్టి శుభకార్యాలు, పుట్టినరోజు, మంచి కార్యక్రమాలు చేసేటప్పుడు తల మీద వేసుకుంటే శుభం కలుగుతుందని విశ్వసిస్తున్నారు. సోమవారం రామజన్మభూమి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ రోజు ఇంటిల్లిపాది అక్షింతలు వేసుకోవాలని సూచిస్తున్నారు.

పండుగ వాతావరణంలో..



శ్రీరామ మందిరంలో బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. శ్రీరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రతి గ్రామంలో అక్షింతల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని కొంతమంది శ్రీరామ భక్తులు 11 రోజుల ఉపవాస దీక్ష చేపట్టారు. మరికొందరు చెప్పులు వేసుకోకుండా దీక్ష తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతిరోజూ శ్రీ రామజపం పఠిస్తున్నారు.

– వసంతం వెంకటేశ్,
మహబూబ్‌నగర్ జిల్లా సంయోజక్,
శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్

ప్రతి వార్డులో అక్షింతల పంపిణీ



మహబూబ్‌నగర్‌లోని ప్రతి వార్డులో ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేశాం. వార్డులో ఒక్కో కలశంలో అక్షింతలు ఏర్పాటు చేసి ప్రతి హిందువు గడపకు వెళ్లి శ్రీరాముడి ఫొటో, కరపత్రం అందజేశాం. శ్రీరాముడికి సేవ చేయడం అంటే పెద్ద పుణ్యకార్యం. జీవితంలో ఇలాంటి అవకాశం రాదు. అక్షింతల ఊరేగింపును వీధుల్లో వైభవంగా నిర్వహించారు.

– మద్ది యాదిరెడ్డి,
మహబూబ్‌నగర్ నగర సంయోజక్,
శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు

నా పూర్వ జన్మ సుకృతం



అయోధ్యలో రామాలయం నిర్మాణం నా జీవితకాలంలో చూస్తా అనుకోలేదు. అప్పుడు శ్రీరాముడికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుంటే ఎంతో సంతోషంగా ఉంది. రామయ్య అక్షింతలు పట్టుకోవడం, ఇంటింటికి తిరిగి పంచే అవకాశం రావడంతో నా పూర్వ జన్మ సుకృతం. 15 రోజుల పాటు ఇంటింటికి వెళ్లి రామయ్య అక్షింతలు పంపిణీ చేశాం.

– బి.లలిత,
సభ్యురాలు,
శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు,
నాగర్‌కర్నూల్

ఆ రాముడే మా ఇంటికి వచ్చినట్లు..



ఎక్కడా చూసినా రామస్మరణే వినిపిస్తుంది. ఇప్పుడు రామజన్మభూమికి వెళ్లలేకపోయినా.. మా ఇంటికి అయోధ్య అక్షింతలు వచ్చాయి. ఆ రాముడే మా ఇంటికి వచ్చి ఆశీస్సులు అందించినట్లు ఉంది. శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వారు అక్షింతలు పంపిణీ చేయడం బాగుంది. అక్షింతలు వేసుకుంటే శుభం కలుగుతుందని నమ్మకం.

– చిలుక పద్మజ,
జేఎల్(ఒకేషనల్), పాలెం

శ్రీరామ వైభవం చాటుదాం..

వనపర్తిటౌన్: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లాకేంద్రంలోని రామాలయంలో శ్రీరామ వైభవం చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు విశ్వనాథం, ప్రతినిధి బాలీశ్వరయ్య, ప్రధాన అర్చకుడు నరేంద్ర ఆచార్యులు తెలిపారు. శనివారం ఆలయంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. సోమవారం ఉదయం 4 గంటలకు సీతారాముల అభిషేకం, సహస్ర పుష్పార్చన, 10 గంటలకు అయోధ్యలో జరిగే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం, మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం రాములవారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు కనులారా వీక్షించేందుకు ఆలయంలో భారీ తెర ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జగదీశ్‌శర్మ, ప్రతినిధులు శ్రీధర్, కొండన్న, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పనుల్లో వేగం పెంచాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్

కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్‌శాఖ ఇంజినీర్లతో అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులు, పురోగతిలో ఉన్న వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 'మన ఊరు–మన బడి' పెండింగ్ పనుల్ని గుర్తించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాల మరమ్మతుకు సంబంధించి 13 పనులు మంజూరు కాగా.. 11 పూర్తయ్యాయని, మిగిలిన రెండుచోట్ల పూర్తి చేయాలని కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్ 15వ ఆర్థిక సంఘం పరిధిలో 62 సబ్‌సెంటర్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు భూ సేకరణ సమస్య ఉంటే నివేదించాలని, పరిష్కారానికి తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఉపాధిహామీ పథకంలో మంజూరైన 100 గ్రామపంచాయతీ భవనాలు, ఎస్డీఎస్డీఎఫ్ కింద మంజూరైన 21 గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశానికి హాజరుకాని ఇద్దరు ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. సమావేశంలో పీఆర్ ఈఈ మల్లయ్య, డా. సాయినాథ్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించాలి..

జిల్లాలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని కలెక్టర్ తేజస్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, ఉపాధి పనులపై ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరాకు ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మిషన్ భగీరథ పథకం ఎస్ఈ జగన్మోహన్, డీఆర్డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ..

గోపాల్‌పేట: బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి ఓటరు నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ పవార్ సూచించారు. శనివారం ఆయన గోపాల్‌పేట, తాడిపర్తి, రేవల్లిలోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లు ఎంతమంది ఉన్నారు.. ఇప్పటి వరకు కొత్తగా ఎంతమంది నమోదు చేసుకున్నారని తహసీల్దార్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ తప్పనిసరిగా పాటించేలా చూడాలని ఎంఈఓ శ్రీనివాసులును ఆదేశించారు. రేవల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి ఇతర అధికారులు ఉన్నారు.

కనిపించని కీలక దస్త్రాలు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు

వనపర్తి: సమీకృత కలెక్టరేట్‌లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) విభాగం కార్యాలయంలో దస్త్రాలు మాయమైన ఘటన శనివారం జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది. ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న వెల్లడించారు. ఈ విషయం శనివారం సాయంత్రం నుంచి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

➪ ఔట్ సోర్సింగ్ విధానం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఆరుగురు ఉద్యోగులు అటెండర్‌తో సహా ఎస్‌డీసీ కార్యాలయంలో పని చేస్తుండటంతో కార్యాలయ నిర్వహణపై పూర్తి అవగాహన ఉంది. సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు, రిజర్వాయర్లు, పునరావాస కేంద్రాల కోసం భూసేకరణ అంశాలపై సమగ్రంగా తెలుసు. పరిహారం కోసం కోర్టులో కేసులు నమోదు చేసిన అంశాలు, కార్యాలయం నుంచి ఇచ్చిన సమాధానం.. కేసుల పురోగతి తదితర అంశాలపై పూర్తి పట్టు ఉంది. కాగా.. రూ.కోట్ల ప్రజాధనానికి సంబంధించి ఈ డిపార్ట్‌మెంట్ ఫైల్స్ విషయంపై ఇటీవల కలెక్టర్ దృష్టి సారించారు. పలువురు సిబ్బందితో కొన్నాళ్లపాటు ఫైల్స్ నిర్వహణ, ఇన్‌వార్డ్, అవుట్ వార్డ్‌లపై విచారణ చేయించారు. సుమారు నెల పాటు విచారణ చేసిన వారు కొన్ని ఫైల్స్ ఇన్‌వార్డ్‌లో నమోదు చేసినవి లేవని నివేదిక ఇవ్వటంతో డిప్యూటీ తహసీల్దార్ స్థాయి ఉద్యోగి ఒకరిని సస్పెండ్ చేశారు. ముఖ్యంగా కోర్టు ఫైల్స్ కనిపించడం లేదని ఎస్‌డీసీ కార్యాలయంలో కొంతకాలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. చిలికి చిలికి గాలివానలా మారిన ఫైల్స్ మిస్సింగ్ అంశం తాజాగా పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఫైల్స్ మిస్సింగ్‌పై ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై అనుమానం ఉన్నట్లు శనివారం ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

కుమ్మక్కే కారణమా..?

భూ నిర్వాసితులు రెట్టింపు పరిహారం కోసం కోర్టుల్లో కేసులు నమోదు చేసిన కొందరు లాయర్లతో కార్యాలయంలోని పలువురు అధికారులు కుమ్మక్కయ్యారా? అన్న అనుమానం తలెత్తింది. దీంతో కీలకమైన పలు ఫైల్స్ కోసం వెదికితే కార్యాలయంలో కనిపించకపోవడం, పలుమార్లు సిబ్బందికి హెచ్చరికలు జారీ చేసినా ఫలితం లేకపోవటంతో కలెక్టర్ తేజస్ పవార్ అనుమతితో ఎస్‌డీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఫిర్యాదులో పేర్కొన్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది పేర్లు, కనిపించని ఫైల్స్ వివరాలు తెలుసుకునేందుకు యత్నించగా.. ఎస్‌డీసీ అందుబాటులోకి రాలేదు. మొదట సెల్‌ఫోన్ మోగినా.. కాసేపటి తర్వాత స్విచ్ఛాఫ్ అనే సమాధానం వచ్చింది.

ఓటరు నమోదుపై అవగాహన

కొత్తకోట రూరల్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. శనివారం పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలను తహసీల్దార్ కిషన్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పు లున్న వారు సరిదిద్దుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా మొదటిసారి కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌కు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. వివిధ శాఖల అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో సీసీ టీవీ ఫుటేజీల పరిశీలన..

వనపర్తి: ఇటీవల ఎంసీహెచ్‌లో చోటు చేసుకున్న ఘటనపై శనివారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఆయా ఫుటేజీలను తనకు పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు ఆస్పత్రిలో ఓపీ కోసం చేస్తున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఆస్పత్రిలో అనైతిక చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



బీఎల్వోలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 79 శాతం హాజరు నమోదు



బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సీఐఎస్

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశాలకు శనివారం జిల్లాలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో రెండు, బాలుర ఉన్నత పాఠశాల, ఆత్మకూర్‌లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 1,046 మంది విద్యార్థులకుగాను 817 మంది హాజరుకాగా, 229 మంది గైర్హాజరయ్యారు. 79 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వివరించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరగగా డీఐఈఓ జాకీర్ హుస్సేన్, ప్రభుత్వ పరీక్షల అధికారి గణేష్‌కుమార్ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులను కేంద్రాల్లోకి అరగంట ముందే అనుమతించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.



బాలికల ఉన్నత పాఠశాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

క్లుప్తంగా

ఏసీబీ వలలో అవినీతి చేప

● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ కల్వకుర్తి డివిజన్ సర్వేయర్


పట్టుబడిన డివిజన్ సర్వేయర్ వశ్యనాయక్

కల్వకుర్తి: వ్యవసాయ భూమి సర్వేకు సంబంధించి ఓ రైతు నుంచి కల్వకుర్తి డివిజన్ సర్వేయర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ వివరాల మేరకు.. వెల్దండ మండలంలోని లింగారెడ్డిపల్లికి చెందిన సిరాజ్ కొన్నేళ్ల కిందట 53 సర్వేనంబర్‌లోని తన ఐదెకరాల పొలాన్ని విక్రయించారు. మిగిలిన భూమి కొలతలలో అనుమానం రావడంతో 2022 మార్చిలో మండల సర్వేయర్‌తో పాటు, ప్రైవేటు సర్వే చేయించుకున్నారు. అయినప్పటికీ అనుమానం తీరకపోవడంతో కొన్ని రోజుల కిందట డివిజన్ సర్వేయర్ వశ్యనాయక్‌ను కలిసి సర్వే చేయాలని కోరారు. అందుకోసం ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు చెల్లించి, ఆరునెలల కిందట డివిజన్ సర్వేయర్‌తో సర్వే చేయించారు. అయితే సర్వేకు సంబంధించిన రిపోర్టు ఇచ్చేందుకు సర్వేయర్ రూ.10వేలు డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో రైతు సిరాజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శనివారం సాయంత్రం అతడి నుంచి సర్వేయర్ వశ్యనాయక్ రూ.8వేలు తీసుకుంటుండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం సర్వేయర్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.

వనపర్తికి చేరిన దినేష్ మృతదేహం



వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి దినేష్ ఈనెల 13న అమెరికాలో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి మృతదేహం శనివారం వనపర్తికి చేరింది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎంఎస్సీ చేసేందుకు అమెరికా వెళ్లిన 15 రోజుల్లోనే మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ శ్రీధర్, ఆయా పార్టీల నాయకులు పరామర్శించారు.

జెర్రిపోతు కుబుసం @ 10.06 అడుగులు



జడ్చర్ల టౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిటలో 10.06 అడుగుల జెర్రిపోతు కుబుసం లభించినట్లు జడ్చర్ల ప్రభుత్వ బీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య శనివారం తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు 7.2 అడుగుల కుబుసం మాత్రమే నమోదైందని.. గొరిటలో కనుగొన్న కుబుసం 10.06 అడుగులు ఉందన్నారు. గ్రామానికి చెందిన ఉపేంద్ర వరిపొలంలో కుబుసం కనిపించగా.. తమకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కుబుసాన్ని కళాశాలలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. దేశంలో కుబుసాన్ని భద్రపరిచే మ్యూజియంలు లేవన్నారు. సాధారణంగా పాము కుబుసాన్ని ఆభరణాల తయారీ, గృహ అలంకరణ వస్తువులుగా వాడుతారన్నారు. దీనిని సేకరించడం, భద్రపర్చటం అత్యంత కష్టమైన, సున్నితమైన పనిగా తెలిపారు. కుబుసం భద్రపర్చటంలో పరిశోధక విద్యార్థిని రమాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాహుల్, ఇందు, అఖిల సహకరించినట్లు తెలిపారు. కళాశాలలో ఇలాంటి అరుదైన అంశాలతో మ్యూజియం ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ తెలియజేశారు.

వైద్య కళాశాలలో వసతుల కల్పన

● రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


నాగర్‌కర్నూల్‌లో వైద్య కళాశాలను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

నాగర్‌కర్నూల్: వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వచ్చే విద్యాసంవత్సరం నాటికి కళాశాలలో అన్ని వసతులు సమకూరుస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించి ఎప్పటిలోగా పూర్తవుతుందని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, వచ్చే విద్యా సంవత్సరానికి సమకూర్చాల్సిన సదుపాయాల గురించి ఆరా తీశారు. కలెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్, టీఎస్ఎంఐడీసీ, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. వైద్య విద్యార్థులతో ముచ్చటించారు. అంతకుముందు జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలు, భోజనం, పారిశుద్ధ్యం తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఆధునిక యంత్రాలున్నా.. సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డా. వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

నల్లమలను అభివృద్ధి చేస్తాం..

అచ్చంపేట: నల్లమలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఎమర్జెన్సీ వార్డు, క్యాజువాలిటీ, డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో కలిసి వైద్యసిబ్బందితో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్‌నగర్‌కాలనీలో రూ.14.3 లక్షలతో నిర్మించనున్న బస్తీ దవాఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగం ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఎమ్మెల్యే వినతి మేరకు ఆస్పత్రిలో వసతులు, వైద్య సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం రంగాపూర్ నిరంజన్‌షావలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.రవిచంద్ర, డా. ప్రభు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సూరం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం


ఉమామహేశ్వరంలో భక్తుల సందడి

● ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు, నిరంజన్‌షావలీ ఉత్సవాలకు తరలొచ్చిన భక్తజనం


నిరంజన్‌షావలీ దర్గా వద్ద క్యూకట్టిన భక్తులు

అచ్చంపేట: అచ్చంపేట మండలంలోని రంగాపూర్ సమీపంలో కొలువుదీరిన ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, నిరంజన్‌షావలీ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులతో రంగాపూర్ సందడిగా మారింది. ఉమామహేశ్వర క్షేత్రంలోని పాపనాశిని గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిరంజన్‌వలీషా దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా వద్ద నుంచి గ్రామపంచాయతీ, ఉమమహేశ్వరం ద్వారం వరకు వాహనాలను అనుమతించ లేదు.

ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ రాములు

ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకుడు వీరయ్యశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గవ్యాంత పూజలు, వాస్తుపూజ, వాస్తు హోమంతో పాటు అభిషేకాలు, వసంతోత్సవం, చక్రస్నానం, త్రిశూల స్నానాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. స్వామివారిని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

218 మంది దంపతులకు షష్టిపూర్తి


షష్టిపూర్తి మహోత్సవంలో పాల్గొన్న జంటలు

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ చింతలపురి చిన్నయ్యస్వామి మఠం రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం సామూహిక షష్టిపూర్తి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల నిండిన 218 మంది శివభక్తుల దంపతులను మఠం పీఠాధిపతి నందీశ్వరస్వామి ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం నందీశ్వర స్వామి అధ్యక్షతన జరిగిన ధర్మజాగృతి సభలో చిన్నయ్యస్వామి మఠం విశిష్టతను వివరించారు. 350 ఏళ్ల కిందట చింతలపూరి చిన్నయ్యస్వామి శ్రీశైలం నుంచి పాదయాత్రగా కొల్లూర్‌కు వచ్చి తపస్సు చేసి భగవంతుడు సాక్షాత్కరించడంతో జీవసమాధి కావాలని నిర్ణయించుకొని గ్రామ ప్రముఖులతో మాట్లాడి స్థలం దాన పూర్వకంగా తీసుకొని జీవసమాధి అయ్యారని వివరించారు. నాటి నుంచి మఠం దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు.

నేడు రుద్రయాగం..

రజతోత్సవ కార్యక్రమంలో చివరి రోజైన ఆదివారం 218 హోమాలతో మఠం ఎదుట మహా రుద్రయాగం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి వివరించారు. 436 జంటలు ఈ హోమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రఘు, ఎంపీటీసీ సభ్యులు తులసీరాం, గోపాల్‌గౌడ్, చంద్రమోహన్, ఖాజా, సేవ్యానాయక్, నారాయణ గుప్తా, కృష్ణ, శ్రీను, క్రాంతి తదితరులు ఉన్నారు.

బాధ్యతలు తీసుకోని కొత్త డీఐజీ?

మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్-7 డీఐజీగా జోయల్ డేవిస్‌ను నియమిస్తూ ఈనెల 3న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొత్త డీఐజీ పోస్టింగ్ ఇచ్చి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టలేదు. జోగుళాంబ జోన్ డీఐజీగా ఉన్న ఎల్ఎస్ చౌహాన్‌ను రామగుండం కమిషనర్‌గా బదిలీ కాగా.. ఆయన స్థానంలో హైదరాబాద్ ఎస్‌బీలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జోయల్ డేవిస్‌ను నియమించారు. అయితే ఇప్పటి వరకు కొత్త డీఐజీ రాకపోవడంతో పాటు పాత డీఐజీ రిలీవ్ కాలేదు. వారి బదిలీలు జరిగి చాలా రోజులు గడుస్తున్నా ఎందుకు బాధ్యతలు తీసుకోలేదనే విషయంపై స్పష్టత రావడం లేదు.

రామన్‌పాడులో 1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,019 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

డిజిటల్ వ్యవస్థపై అవగాహన అవసరం

● పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్


ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పీయూ వీసీ, కళాశాల అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ రంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం డిజిటల్ రంగంపై ఏర్పాటు చేసిన సెమినార్‌కు వీసీతో పాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రానున్న కాలంలో డిజిటల్ వ్యవస్థ ప్రతి వ్యక్తి జీవితంలో భాగంగా మారనుందని.. వివిధ రంగాల్లో వినూత్న మార్పులు చోటు చేసుకోనున్నాయన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు పూర్తి స్థాయిలో పరిశోధన దృష్టితో చూడాలని సూచించారు. డిజిటల్ వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఉన్నత విద్యరంగంలో అనేక మార్పులు జరగాల్సిన అవసరం ఉందన్నారు. యువత నైపుణ్యం, విజ్ఞానం పెంచుకోవడం వల్ల మరింత సులభంగా మారుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వీసీతో పాటు కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్ఎస్ రాజేందర్‌సింగ్, అధ్యాపకులు విజయ్‌కుమార్, గంగాధర్, శేఖర్, చిన్నమ్మ, పద్మా వతి, మనోహర్‌రెడ్డి, నాగేంద్రస్వామి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

● పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే విజయుడు
● పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం పెద్దదిన్నెలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాత సేవ, ద్వారతోరణం, ధ్వజ కుంభారాధనలు, కలశ స్థాపన, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, ఆవాహిత దేవతా హోమాలు, లఘు పూర్ణాహుతి, నివేదన హారతి, తీర్థగోష్ఠి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. అంతకుముందు ఎమ్మెల్యే విజయుడు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవానికి అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు హాజరై తిలకించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారిని శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగపట్నం నర్సన్నకు డోలోత్సవం


లక్ష్మీనరసింహస్వామికి డోలోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లాపూర్ రూరల్: సింగోటం లక్ష్మీనరసింహ స్వామికి శనివారం డోలోత్సవం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గర్భగుడిలో డోలోత్సవంతో పాటు చప్పరపు సేవను కనుల పండువగా నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో వెలసిన పలు దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి.

ఆలయ భూముల కౌలు బకాయి రూ.30లక్షలు

● కౌలు డబ్బులు చెల్లించాలి: ఈఓ పురేందర్‌కుమార్
● బకాయిలు చెల్లించని వారికి నోటీసులు


ఆలయ భూములను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ


జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయ భూములను కౌలుకు తీసుకున్న కొందరు 11 ఏళ్లుగా డబ్బులు చెల్లించకుండా మొఖం చాటేశారు. ఆలయానికి సుమారు రూ.30 లక్షలకుపైగా కౌలు డబ్బులు వసూలు కావాల్సి ఉండగా.. గత పాలకమండలి, అధికారులు దృష్టి సారించలేదు. శనివారం పెండింగ్ ఫైళ్లను పరిశీలించిన ఆలయ ఈఓ పురేందర్‌కుమార్.. పెద్ద మొత్తంలో రావాల్సిన కౌలు డబ్బులను ఎందుకు వసూలు చేయడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడి ఇతర కారణాలను సిబ్బంది ఈఓకు తెలియజేయగా.. ఇవన్నీ కుదరవని, ప్రతి పైసా వసూలు కావాలని తేల్చిచెప్పారు. ఈవిషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ చిన్నకృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లగా.. దేవుడికి కట్టాల్సిన ప్రతి పైసా వసూలు చేయాలని, ఈ విషయంలో ఎవరిని ఉపేక్షించేది లేదని అన్నారు. అనంతరం కౌలు బకాయి చెల్లించాల్సిన రైతులను ఆలయ ఈఓ, చైర్మన్ కలిశారు. ఇప్పటికే చాలా జాప్యం చేశారని, దేవుడికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో లీగల్ నోటీసులు పంపిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కొంత మందికి లీగల్ నోటీసులు పంపినట్లు వారు తెలిపారు.

కంపచెట్ల తొలగింపుకు ఆదేశాలు..

ఇమాంపూర్ పరిధిలోని 12, 14 సర్వేనంబర్లలో సుమారు 24 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో చాలా కంపచెట్లు పెరిగాయి. దీంతో పంట సాగుకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆలయ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ.. ఆయా భూములను పరిశీలించారు. వెంటనే జేసీబీ సాయంతో కంపచెట్లను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య ఆచారి, రికార్డు అసిస్టెంట్ శ్రీకాంత్ ఉన్నారు.

శ్రీరామా.. నీనామమెంతో రుచిరా..


ఇల్లూరి శ్రీలక్ష్మి


బియ్యపు గింజలపై రాసిన శ్రీరామ నామం

గద్వాల: అయోధ్య రామ మందిరంలో బలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని గద్వాల జిల్లా కేంద్రంలోని వెంకటరమణ కాలనీకి చెందిన ఇల్లూరి శ్రీలక్ష్మి బియ్యపు గింజలపై శ్రీరామనామాలు రాస్తూ భక్తిని చాటుకున్నారు. సూక్ష్మ చిత్రకళలో ఈమెకు తర్ఫీదు లేకున్నా.. భక్తితో 10,116 బియ్యపు గింజలపై రామనామం రాశారు. రామనామం జపిస్తూ, భక్తితో రాసిన బియ్యపు గింజలను అయోధ్య ఉత్సవాలకు అక్షింతలుగా పంపినట్లు ఆమె తెలిపారు. డిగ్రీ వరకు చదివిన ఈమె గృహిణిగా ఉంటూ.. భర్త న్యాయవాది ఇల్లూరి వెంకటేష్, పిల్లల సహకారంతో 2015 నుంచి శ్రీరామ నామాలు రాయడం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం బియ్యపు గింజలపై శ్రీరామ నామాలు రాస్తూ శ్రీరామనవమి వేడుకలకు తలంబ్రాలుగా అందజేస్తున్నారు. గతంలో ఒకసారి 50వేలు, మరో ఏడాది 1.50 లక్షల బియ్యపు గింజలపై రాసిన శ్రీరామ నామాలను భద్రాచలంలో జరిగే కల్యాణోత్సవానికి పంపారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగా కూడా బియ్యపు గింజలపై 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరి మంత్రం రాసి భక్తిని చాటుకున్నారు.

కాడెడ్లు మునిగి.. గుండెకోత మిగిలి


మృతి చెందిన కాడెడ్లు

పెబ్బేరు రూరల్: కాడెడ్ల మృతి రైతన్న కంట కన్నీరు పెట్టించింది. ఈ విషాదకర ఘటన వనపర్తి మండలం పెద్దగూడెంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పెద్దగూడెం గ్రామానికి చెందిన నాగపురి ఆంజనేయులు తన పొలంలో వరి నాటు వేసేందుకు కాడెడ్లతో కరిగెట పనులు చేపట్టాడు. సాయంత్రం పనులను ముగించుకుని ఎడ్లబండిపై వ్యవసాయ పనిముట్లతో ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని చెరువులో కాడెడ్లను శుభ్రం చేసేందుకు తీసుకెళ్లగా.. ప్రమాదవశాత్తు నీటి గుంతలో బండితో సహా నీటిలో పడిపోయి మృత్యువాత పడ్డాయి. అప్పటి వరకు వ్యవసాయ పనులు చేసిన కాడెడ్లు.. రైతు కళ్లెదుటే మృతి చెందడం తీవ్ర విషాదం రేపింది. వాటి విలువ దాదాపు రూ.2లక్షలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

హెచ్‌సీఏ అండర్-23 రాష్ట్ర జట్టుకు అరుణ్‌కుమార్



మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ అండర్-23 రాష్ట్ర జట్టుకు గద్వాలకు చెందిన టి.అరుణ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఇటీవల ఇదే జట్టులో స్టాండ్‌బైలో చోటు దక్కించుకున్న అరుణ్‌కుమార్.. తుది జట్టులో స్థానం సంపాదించుకున్నారు. ఇప్పటి వరకు ఏడు త్రిడేస్ మ్యాచుల్లో ఆడాడు. గతేడాది, ఈ సీజన్ త్రిడేస్ (వన్డే, టీ-20)ల్లో 55 వికెట్లు తీశాడు. 40కిపైగా టూడేస్ మ్యాచుల్లో ఆడి, 100కుపైగా వికెట్లు తీశాడు. పలు రాష్ట్రాల జట్లతో జరిగే అండర్-23 మ్యాచ్‌లకు హెచ్‌సీఏ అండర్-23 జట్టు తరపున అరుణ్‌కుమార్ ఆడనున్నారు. అరుణ్‌కుమార్ ఎంపికపై మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్‌తో పాటు ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, ఉదేశ్, కోచ్‌లు అబ్దుల్లా, గోపాలకృష్ణతో పాటు కృష్ణమూర్తి, లక్ష్మీకాంతరావు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో రాణించి.. రంజీ ట్రోఫీకి, దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు.

మూడు ఇళ్లలో చోరీ

వెల్దండ: వెల్దండ మండలంలోని పల్గుతండాలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. ఇళ్లకు తాళాలువేసి పనులకు వెళ్లగా, గుర్తు తెలియని దుండగులు తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. నేనావత్ సక్రి ఇంట్లో 3 తులాల బంగారం, నేనావత్ హేమ్లు ఇంట్లో రూ.30వేల నగదు, రామావత్ మేరి ఇంట్లో రూ. 10వేల నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా మరో మూడు ఇళ్లలో చోరీకి యత్నించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.